సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



చదువుల పండగకు సర్వం సిద్ధం

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో చదువుల పండగ పేరుతో ఆదివారం నుంచి 4వ తేదీ వరకూ మహాక్రతువులు నిర్వహించనున్నారు.


II లో



అంతర్వేదిలో గొప్పగా..

అంతర్వేది ఉత్సవాలంటే కనులకు వైకుంఠమే.. అలాంటి వేడుకలకు సమయం దగ్గర పడడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 13,275 మంది హాజరు

అమలాపురం టౌన్: ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి శనివారం నిర్వహించిన మొదటి దశ నైతికత–మానవ విలువలు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 13,448 మంది విద్యార్థులకు గాను 13,275 మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) వనుము సోమశేఖరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను డీఐఈఓ సందర్శించి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో పరీక్షలు జరుగుతున్న తీరుపై చర్చించారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. పర్యావరణ విద్య పరీక్ష సోమవారం జరుగుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

కల్యాణోత్సవాలకు పందిరిరాట ముహూర్తం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న ఈఓ దుర్గాభవాని తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో కొలువైన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారి దివ్య కల్యాణోత్సవానికి శనివారం ఆలయ ప్రాంగణంలో పందిరి రాట ముహూర్తం చేశారు. దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అల్లు వెంకట దుర్గాభవాని, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పాల్గొని పూజలు చేశారు. దేవస్థాన అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణ, చండీ హోమదారులు వాయిద్య కారులతో ప్రత్యేక పూజలు చేసి రాట ముహూర్తం చేశారు. సహాయ కమిషనర్ దుర్గాభవాని మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 14 వరకూ స్వామివారి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

శెట్టిబలిజ సంఘ మాజీ అధ్యక్షుడి మృతి



దొమ్మేటి వెంకట స్వామి (ఫైల్)

అల్లవరం: తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల కేంద్ర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలు అందించిన అల్లవరం మండలం బోడసకుర్రుకు చెందిన దొమ్మేటి వెంకటస్వామి అనే బాబూరావు (80) మృతి శెట్టిబలిజ సామాజిక వర్గానికి తీరని లోటని ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు అన్నారు. కొంత కాలం నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న బాబూరావు అనారోగ్యంతో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన గతంలో బోడసకుర్రు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సర్పంచ్‌లు కడలి గంగాచలం, రాయుడు విష్ణు, ఎంపీటీసీ సభ్యులు గుబ్బల రంగనాథ స్వామి, దొమ్మేటి శ్రీకాంతిభవాని, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతి తెలిపారు.

- శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి మనవడు దొమ్మేటి వెంకటస్వామి. ఇద్దరూ జాతి అభ్యున్నతికి కృషి చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ అన్నారు. ఆయన మృతి పట్ల విశ్వరూప్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశ్వరూప్‌తో పాటు కోనసీమ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు మట్టపర్తి మీరాసాహేబ్ శెట్టి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, వాసంశెట్టి తాతాజీ, వాసర్ల వెంకన్న, కుడుపూడి బాబు, విత్తనాల శేఖర్, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు తదితరులు సంతాపం తెలిపారు.

వేలాదిగా శృంగార వల్లభుని సన్నిధికి..



విశేష అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి మాఘ మాసం తొలి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. సుమారు 20 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవలు, కేశఖండన టికెట్లు, అన్నదాన విరాళాలుగా స్వామి వారికి రూ.3,89,409 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. 8 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామన్నారు.

ఆశలు... అడియాశలై...



- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- ఉద్యోగులు, మధ్య తరగతి వర్గాలకు ఊరట
- రైతులు, వ్యాపారుల పెదవి విరుపు

సాక్షి, అమలాపురం: కేంద్ర బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.. జిల్లాకు వరాల జల్లు కురిపిస్తారని అంతా అనుకున్నారు.. చివరికి కేటాయింపులు అంతంత మాత్రంగా ఉండడంతో ప్రజలంతా నిరాశకు గురయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయంపై రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపు ఇవ్వడంతో కొన్ని వర్గాలకు మేలు జరిగింది. ఇదే సమయంలో నిత్యావసరాలపై ఉన్న జీఎస్టీ తగ్గించకపోవడంపై వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. కిసాన్ రుణ పరిమితిని.. వడ్డీ రాయితీని పెంచడం ద్వారా అన్నదాతకు కొంత భరోసా కల్పించింది. ఇదే సమయంలో జిల్లాకు జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అరకొర కేటాయింపులు, నిర్వాసితులకు సగం మాత్రమే పరిహార భారం మోస్తామనే ప్రకటన ప్రాజెక్టు భవిష్యత్‌పై దిగులు పెంచింది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు ప్రకటించకపోవడం జిల్లాలో నిరుద్యోగులు, రైతులను నిరాశ పరిచింది.

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం కేంద్ర వార్షిక బడ్జెట్ 2025–26ను ప్రవేశ పెట్టారు. ఇందులో జిల్లాకు నేరుగా మేలు చేసే ఒక్క ప్రాజెక్టు కూడా కనిపించలేదు. కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌కు కేటాయింపులు ఎంతనేది రెండు, మూడు రోజుల్లో తేలనుంది. అయితే జిల్లాలోని వివిధ వర్గాల వారిపై ఈ బడ్జెట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపనుంది. వ్యక్తిగత పన్ను మినహాయింపు రూ.ఏడు లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ పెంచడంతో ఉద్యోగులు, చిరు వ్యాపారులకు మేలు జరగనుంది. జిల్లాలో సుమారు 25 వేల మంది వరకూ పన్ను చెల్లింపుదారులు ఉంటారని అంచనా. ఈ పెంపుతో 15 వేల మంది పన్ను భారం నుంచి తప్పించుకోనున్నారు.


గోదావరి డెల్టాను స్థిరీకరించే పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు కేటాయించారు. కేంద్రం నుంచి ఈ ప్రాజెక్టుకు రావాల్సింది రూ.12,157 కోట్ల వరకూ ఉండడం గమనార్హం. నిర్వాసితుల పరిహారానికి సంబంధించి కేవలం 41.15 మీటర్ల నీటి నిల్వ వరకూ మాత్రమే ముంపు పరిహారం ఇస్తామని ప్రకటించారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గి కొత్త ఆయకట్టు దేవుడెరుగు గోదావరి డెల్టాలో ఆయకట్టుకు సైతం పూర్తి స్థాయిలో నీరందించలేని పరిస్థితి వస్తోందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలు కొండెక్కి సామాన్యుడు బతకడం ఇబ్బందిగా మారిన తరుణంలో వాటిపై జీఎస్టీ భారం తగ్గిస్తారని చిరు వ్యాపారులు, సామాన్యులు.. చేనేత ముడి సరుకుల మీద సైతం జీఎస్టీ తగ్గింపు ప్రకటన వస్తోందని ఆయా వర్గాల ప్రజలు ఎదురు చూశారు. అయినా ఫలితం లేకపోయింది. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)లకు భారీగా కేటాయింపులు చేయడం యువతకు ఆసక్తిని రేపింది. కోనసీమ జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరి, 1.03 లక్షల ఎకరాల్లో కొబ్బరి, 40 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, సుమారు 20 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఇలా పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లాలో వాటి అనుబంధ పరిశ్రమలకు ఎంఎస్ఎంఈలు కొంత వరకు మేలు చేస్తాయి. వాటితో పాటు ఆహార శుద్ధి పరిశ్రమలు, విలువ ఆధారిత పరిశ్రమలకు సైతం కేటాయింపులు మరింత పెంచడంతో పాటు సులభంగా రుణాలు, రాయితీలు ఇచ్చే చర్యలు తీసుకుంటే మేలు జరిగేదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

జీఎస్టీ బాదుడు బడ్జెట్ ఇది



కేంద్ర బడ్జెట్‌తో బడుగు బలహీన వర్గాలు, దళితులకు ఏ మాత్రం ప్రయోజనం లేదు. ఇది బడుగుల బడ్జెట్ కాదు, జీఎస్టీ బాదుడు బడ్జెట్. ప్రపంచ బ్యాంక్ సూచనలతో అప్పులకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్. దీని రూపకల్పనలో సామాజిక కోణం లేదు. దేశ జనాభా దాదాపు 160 కోట్ల మంది ఉంటే అందులో 100 కోట్ల మందికి ప్రయోజనం చేకూరలేదు. –కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, అమలాపురం



వ్యాపారులకు మేలు ఎక్కడ



ఈ బడ్జెట్ వల్ల వ్యాపార వర్గాలకు పెద్దగా మేలు జరగదు. నూనెలు, పప్పులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. వీటిపై జీఎస్టీ తగ్గిస్తే బాగుండేది. అలాచేస్తే వ్యాపారులతోపాటు సామాన్యులు కూడా మేలు జరిగేది.
–దండుమేను రమేష్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ, అమలాపురం

పోలవరంపై భరోసా ఇవ్వలేదు



పోలవరం ప్రాజెక్టుపై ఎటువంటి భరోసా ఇవ్వలేదు. 41.15 మీటర్ల నీటి నిల్వ వరకూ మాత్రమే ముంపు పరిహారం ఇస్తామంటున్నారు. కానీ వాస్తవంగా 194.6 టీఎంసీల నీరు నిల్వ ఉంచితేనే ఈ ప్రాజెక్టుతో సంపూర్ణ ప్రయోజనం అందుతోంది. కానీ కేంద్రం మాత్రం 45.72 మీటర్ల ఎత్తున నీటి నిల్వ ఉంచితే మునిగిపోయే ప్రాంతాలకు ఇవ్వాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇస్తామని చెప్పకపోవడం, ఇందుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయకపోవడం అన్యాయం.
–కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కంటితుడుపు చర్యే



రైతులకు వ్యవసాయ రుణాల నిమిత్తం బ్యాంకులు ఇచ్చే రుణ పరిమితి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడం కంటితుడుపు చర్యే. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూ.5 వేలు ఉన్నప్పుడే రుణ పరిమితి రూ. 3 లక్షలు ఉంది. ప్రస్తుతం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎకరానికి రూ. 45 వేల వరకూ రుణాలు ఇస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెరిగిన స్థాయిలో రుణపరిమితిని పెంచలేదు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను చట్టబద్ధత చేస్తారని ఆశించాం. ఈ విషయంలో కూడా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రైతులకు మొండిచేయి చూపారు.
–జున్నూరి రామారావు, ఏపీ అగ్రిమిషన్ మాజీ సభ్యుడు, డి.రావులపాలెం



ట్యాక్స్ పరిధి పెంచడం మంచిది



కేంద్ర వార్షిక బడ్జెట్ 2025–26లో వ్యక్తిగత ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిని రూ.12 లక్షలకు పెంచడం చాలా పెద్ద నిర్ణయం. దేశంలో అతిపెద్ద సమస్య నిరుద్యోగం, కానీ నిరుద్యోగం అంశాన్ని ఎక్కడ కూడా చెప్పలేదు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఎక్కువ నిధులు ఇచ్చి ఉంటే బాగుండేది.
–గుంటూరు అప్పారావు, హెచ్ఎం, మండల పరిషత్ నంబర్ వన్ ప్రాథమిక పాఠశాల, రాయవరం

ఆ ప్రస్తావనే లేదు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్ర ప్రజల ఆశలు అడియాసలు అయ్యాయి. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను బడ్జెట్‌లో పూర్తిగా పక్కన పెట్టారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, గిరిజన యూనివర్సిటీ, వైజాగ్ మెట్రో తదితర అంశాలపై ప్రస్తావనే లేదు. రాష్ట్ర విజ్ఞప్తులను కేంద్రం అసలు పట్టించుకోలేదు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ముఖ్యంగా అధికార పార్టీ ఎంపీలు నిలదీయాలి.
–వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్

5న ఫీజు పోరుకు సిద్ధంకండి

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పిలుపు

పి.గన్నవరం: విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 5న అమలాపురంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ఫీజు పోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి నేతలు నేటికీ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అమ్మకు వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి పథకాలు అమలు చేయకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, వాటిని ప్రైవేటు పరం చేసేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారని విప్పర్తి, గన్నవరపు అన్నారు. నిరుద్యోగ యువత మాట ఎలా ఉన్నా.. పి.గన్నవరం నియోజకవర్గంలో మాత్రం కూటమి నాయకులకు నిరుద్యోగ భృతి కింద ఇసుక, మట్టి దోచుకోమని అగ్రనేతలు ఆదేశాలు ఇచ్చారని విమర్శించారు. ఫీజు పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, విద్యార్థుల తల్లిదండ్రులు తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. అనంతరం వారు ఫీజు పోరు పోస్టర్‌ను విడుదల చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, కుడుపూడి విద్యాసాగర్, నాయకులు పేరి శ్రీను, మందపాటి కిరణ్‌కుమార్, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి తదితరులు

వెంకన్న స్వామీ.. సదా స్మరామి

- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజే రూ.33.62 లక్షల ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం తెల్లవారుజామున అర్చక స్వాములు స్వామివారి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామివారిని అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారితో పాటు, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. ముందుగా భక్తులు గౌతమీ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అలాగే ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానిక స్వామివారి సేవ వలంటీర్లు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఒక్కరోజు స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.33,62,453 ఆదాయం సమకూరినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు.



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

శనైశ్చర స్వామికి తైలాభిషేకాలు

మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తైలాభిషేకాలు జరిపారు. దేవస్థానానికి తైలాభిషేకాల ద్వారా రూ.1,22,390, అన్న ప్రసాద విరాళాలుగా రూ.27,496 వచ్చిందని ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

ఊరిలోనే ఉపాధి బాట

- జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి 19 ఏళ్లు
- తొలిసారిగా డాక్టర్ వైఎస్సార్ హయాంలో అమలు
- కూలీల వలసల నివారణకు దోహదం
- టీడీపీ పాలనలో అక్రమాలకు నిలయం
- మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో నవోదయం



వెదురుమూడిలో తడిసిన ధాన్యాన్ని రైతు కోరిన చోటుకు తరలిస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)



ఉపాధి పథకంలో పనులు చేస్తున్న కూలీలు

కపిలేశ్వరపురం: ఊరులోనే ఉపాధి దొరికితే అంతకన్నా ఆనందం ఉంటుందా... వలసల బాట లేకుండా, కూలి పనుల కోసం వెతుకులాడకుండా అందరికీ పనులు కల్పించే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పురుడు పోసుకుంది.. పేదలకు ఈ పథకం ఎంతగానో ఆసరాగా నిలుస్తోంది. దేశంలో 2006కు ముందు గ్రామాల్లో పనులు లేక, పస్తులుంటూ జీవించిన కూలీలకు ఉపాధి కల్పించింది.. అప్పట్లో కేంద్రంలో ప్రధానిగా మన్మోహన్‌సింగ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన సాగుతున్న రోజుల్లో ప్రజల ముందుకు ఈ పథకం వచ్చింది. దీనికి 19 ఏళ్లు నిండింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక గ్రామాల అభ్యున్నతికి దోహదపడింది. ప్రజల మేలు కోరి పాలన సాగించిన మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ పథకం క్షేత్ర స్థాయిలో మెరుగైన ఫలితాలనిచ్చింది. ఒకప్పటి టీడీపీ పాలనలో ఉపాధి హామీ పథకం అక్రమాలకు నిలయంగా, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కాసులు కురిపించే పథకంగా మారింది. ప్రస్తుత కూటమి పాలనలో కూడా నిస్తేజంగా ఉంది.

పథకం ఉద్దేశమిది..

ప్రతి కూలీకి ఏడాదికి వంద రోజులు పని కల్పించే లక్ష్యంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం రూపొందింది. పనిలేక ఆకలితో చనిపోయే పరిస్థితులను రూపుమాపడం, ఇతర ప్రాంతాలు, వృత్తులకు మళ్లిపోతున్న వారిని ఈ పథకం వైపు తీసుకెళ్లడం ప్రధాన ధ్యేయం. క్షేత్ర స్థాయిలో ప్రజలకు పని కల్పించి కనీస కూలి కల్పించాలన్న ఆలోచన 1991 పీవీ నరసింహారావు హయాంలోనే కేంద్ర ప్రభుత్వం చేసింది. తర్వాత కాలంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న యూపీఏ ప్రభుత్వంలో పథకం కార్యాచరణ రూపం దాల్చింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 పేరుతో ఆగస్టు 23న బిల్లు ఆమోదమైంది. 2006 ఫిబ్రవరి 2న పథకం ప్రారంభమైంది. అలా ప్రారంభమైన ఉపాధి పథకానికి ఆదివారంతో 19 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులు కేటాయిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 18,53,328 మంది జనాభా ఉండగా మొత్తం 1.53 లక్షల జాబ్ కార్డులు ఇచ్చారు. 2.27 లక్షల మంది కూలీలు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 18,43,903 జనాభా ఉండగా, 1,61,372 మందికి జాబ్‌కార్డులు ఇవ్వగా 1,11,815 మంది కూలీలున్నారు. కాకినాడ జిల్లాలో 22,55,668 మంది ప్రజలు ఉండగా, 1.96 లక్షల కార్డులకు 1.95 లక్షల మంది కూలీలున్నారు.

గత ప్రభుత్వంలో ముందుకు..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉపాధి పథకాన్ని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్లారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ అనుబంధ, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూనే కూలీలతో పనులు చేపట్టే వాటికి మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. ఉపాధి కూలీలకు పని కల్పనకే పరిమితం కాకుండా మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో అభివృద్ధికి బాట వేశారు. గ్రామ పాలనలో కీలకమైన సచివాలయం, రైతు భరోసా, పాల సేకరణ కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 467 గ్రామ, 48 వార్డు సచివాలయాలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 445 గ్రామ, 175 వార్డు సచివాలయాలు, తూర్పుగోదావరి జిల్లాలో 393 గ్రామ, 119 వార్డు సచివాలయాలుండగా వాటిలో అనేక సచివాలయాలకు సొంత భవనాలు సమకూరాయి. ప్రతి పనినీ జియోట్యాగింగ్ పద్ధతిలో చేసి పారదర్శక పాలనగా పేరు తెచ్చుకున్నారు. ఆధార్ అనుసంధానం చేసి కూలీలకు డబ్బు సక్రమంగా అందేలా డీబీటీ విధానాన్ని తీసుకొచ్చారు. పనులు చేసిన వెంటనే బిల్లులు సైతం జమ అవుతుండటంతో ఉపాధి పనులకు వస్తున్న కూలీల సంఖ్య పెరిగింది. అన్ సీజన్లో సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు సుమారు 10 వేల మందికి పైగా ఉపాధి పొందగలిగారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణంలో 90 పనిదినాలకు సంబంధించిన పనులు చేపట్టారు. నీటిపారుదలకు ఆటంకం కలగకుండా చెరువులు, పంట, పిల్ల కాలువల పూడికతీత పనులు, గ్రామీణ రహదారుల అనుసంధానం, హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ కాలనీల్లో మ్యాజిక్ సోక్ పిట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మురుగు నీరు బయటకు వెళ్లేలా కమ్యూనిటీ సోక్ పిట్ల పనులు చేపట్టారు. వరుస వర్షాలకు ధాన్యం తడిచి అయోమయంలో ఉన్న రైతుకు ఉపాధి పథకం కూలీలు తోడుగా నిలిచే అవకాశాన్ని గత సీఎం వైఎస్ జగన్ కల్పించారు. తడిచిన ధాన్యాన్ని రైతు కోరిన చోటకు తరలించడం ద్వారా కూలీలు సామాజిక సేవలో భాగస్వాములయ్యారు.

వైఎస్సార్ హయాంలో ఉద్యమంలా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉపాధి పథకం అమలు ఒక ఉద్యమంగా సాగింది. చెరువులు, పంట కాలువలు, బోదెల తవ్వకాలతో పెద్ద ఎత్తున కూలీలకు పని కల్పించారు. ఉద్యానవన విభాగంలో ఉద్యాన తోటల పెంపకానికి అవకాశం కల్పించారు. ఇందిర జలప్రభ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గీయులకు చెందిన బీడు భూములను సాగు భూములుగా మార్చారు. తర్వాత కాలంలో టీడీపీ అధికారంలోకి రాగా ఉపాధి హామీ పథకం అక్రమాలకు నిలయంగా మారింది. నీరు–చెట్టు పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కాసుల వర్షం కురిపించింది. పని చేసిన కూలీలకు బకాయిలు పెట్టి నానా తిప్పలు పెట్టింది. చేసిన పనులు సైతం నాణ్యతా లోపంతో ఉండటంతో పథకం నిర్వహణ వివాదాస్పదమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలనలోనూ తీరు మారలేదన్న విషయం ఇటీవల గ్రామ, మండల స్థాయిలో నిర్వహించిన గ్రామసభల్లో వ్యక్తమైంది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 - 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

అంతర్వేదిలో గొప్పగా..



ప్రధాన ద్వారం వద్ద ఆకర్షణీయంగా అలంకరణ



ఆలయం వెలుపల ఐరన్ రాడ్లతో క్యూ లైన్



ఆలయానికి ఉత్తరం వైపున తెప్పోత్సవానికి తాత్కాలిక చెరువు పనులు

అంతర్వేది ఉత్సవాలంటే కనులకు వైకుంఠమే.. అలాంటి వేడుకలకు సమయం దగ్గర పడడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 4 నుంచి ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆయా శాఖల ఆధ్వర్యంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవాలయం, పరిసర ప్రాంతాల్లో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో క్యూ లైన్లు, డెకరేషన్ పనులు చేపట్టారు. ఆలయానికి ఉత్తరం వైపున స్వామివారి తెప్పోత్సవానికి తాత్కాలిక చెరువు తవ్వే పనులు వేగవంతం అయ్యాయి.

– సఖినేటిపల్లి



అంతర్వేదిలో కల్యాణ వేదిక ప్రాంతంలో తాటాకుల పందిరి

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్



మూలపేట హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: జల్సాలకు అలవాటు పడి, అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తి తన భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు, సదరు నిందితుడిని అరెస్ట్ చేశామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్సై వెంకటేష్‌తో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వారి కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాలను తొమ్మిదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అతను జల్సాలు చేయడమే కాకుండా, అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. గత నెల 18న అర్ధరాత్రి సమయంలో భార్యతో గొడవ పడ్డాడు. తర్వాత బాల మెడకు చున్నీతో ఉరివేసి దిండుతో ఊపిరి ఆడకుండా చేశాడు. బాల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వాంతులు, విరోచనాలు కావడంతో మృతి చెందిందని ప్రసాద్ సమాచారం అందించాడు. బాల మృతదేహాన్ని తర్వాత రోజు ఖననం చేశారు. బాల తల్లి గింజాల లక్ష్మి తన కుమార్తె అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖననం చేసిన మృతదేహాన్ని తర్వాత రోజు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోస్టుమార్టం నిర్వహించారు. జనవరి 30న వచ్చిన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా, దర్యాప్తు మేరకు ముద్దాయిపై హత్య కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారనే సమాచారంతో ప్రసాద్ శనివారం గ్రామ రెవెన్యూ అధికారి వద్ద లొంగిపోవడంతో అరెస్ట్ చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

చదువుల పండగకు సర్వం సిద్ధం

- నేడు లక్ష కలాల పూజ
- అయినవిల్లిలో ఏర్పాట్లు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో చదువుల పండగ పేరుతో ఆదివారం నుంచి 4వ తేదీ వరకూ మహాక్రతువులు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని ఆలయ ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు శనివారం తెలిపారు. శ్రీపంచమి సందర్భంగా ఆదివారం గణపతి కల్ప ప్రారంభంతో సప్తనదీ జలాభిషేక సహిత లక్ష కలాల వితరణ మహోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. స్వామివారి సప్తనదీ జలాభిషేకం కోసం సప్త నదులైన గోదావరి, గంగ, యమున, సరస్వతి, సింధు, కావేరి, నర్మద నుంచి ఆలయ అధికారులు జలాలు సేకరించారు. భక్తుల దర్శనార్థం ఆలయ మండపంలో సప్తనదీ జలాలు, లక్ష కలాలు ఉంచారు. జలాభిషేకం అనంతరం స్వామివారి పాదాల వద్ద లక్ష కలాలతో పూజలు చేసేందుకు వేద పండితులు ఏర్పాట్లు చేశారు. 3న సరస్వతీ కల్పం, 4న మహా పూర్ణాహుతి పూజలు ఉంటాయి. శ్రీపంచమి సందర్భంగా స్వామివారి సన్నిధిలో విద్యార్థులచే సరస్వతీ పుజలు చేయిస్తారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారని ఈఓ తెలిపారు. లక్ష కలాలను విద్యార్థులకు ఈ నెల 8, 9 తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు. స్వామి కలాలతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయనేది విద్యార్థుల నమ్మకం. అందుకే స్వామివారి కలాల కోసం విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ సారి కూడా స్వామివారి సప్తనదీ జలాలు, లక్ష కలాల వితరణ కార్యక్రమానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



విశేష అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో సప్త నదుల నుంచి సేకరించిన జలాలు

భక్తులతో కిటకిట

స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృత, లఘున్యాస అభిషేకాలు, శ్రీలక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, తులాభారం జరిపారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1,720 మంది భక్తులు స్వీకరించారు. ఈ ఒక్కరోజు వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలు, తదితర వాటి ద్వారా రూ.2.44 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

కానిస్టేబుల్ నిజాయితీ

జగ్గంపేట: ఓ కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నాడు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం.. జగ్గంపేటలో కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ తోట సూరిబాబు దుస్తులు కొనుగోలు చేశారు. అయితే దుస్తుల సంచితో పాటు రూ.8 లక్షలు ఉంచిన సంచిని కూడా సూరిబాబుకు ఆ వస్త్ర దుకాణ యజమాని శేక్ బబ్లూ అందజేశారు. ఇది గమనించని కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత పొరపాటును గమనించిన బబ్లూ జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు, రైటర్ కృపావరం తక్షణం స్పందించి సీసీ కెమెరాలు, ఫోన్ పే చేసిన నంబర్ ద్వారా నగదు కవరును పట్టుకుని వెళ్లిన వ్యక్తిని గుర్తించారు. అతను కాకినాడకు చెందిన కానిస్టేబుల్ కావడంతో అతనికి జరిగిన పొరపాటును వివరించారు. అది గమనించిన కానిస్టేబుల్ సూరిబాబు నిజాయితీగా నగదు ఉన్న సంచిని సీఐ, ఎస్సైలకు అందజేశారు. దానిని వారు షాపు యజమాని బబ్లూకి అందజేయడంతో అతను పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.



రూ.8 లక్షలను వస్త్ర దుకాణ యజమాని బబ్లూకు అందజేస్తున్న జగ్గంపేట సీఐ, ఎస్సై

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్



చెస్‌లో రేటింగ్ సాధించిన విద్యార్థులు

అమలాపురం టౌన్: అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించారని ఆ అకాడమీ ప్రిన్సిపాల్, జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకటసురేష్ తెలిపారు. పెద్దాపురం జవహర్ నవోదయ స్కూల్‌లో చదువుతున్న కొండా శివేంద్ర 1,406 రేటింగ్ పాయింట్లు, అమలాపురం విద్యానిధి స్కూల్‌లో చదువుతున్న పితాని రాఘవేంద్ర 1,443, సాధనాల శ్రీసంతోష్ 1,494 రేటింగ్ పాయింట్లు సాధించారని అన్నారు. ఇంత వరకూ విక్టరీ అకాడమీకి చెందిన 30 మంది విద్యార్థులు రేటింగ్ సాధించారని వివరించారు. అంతర్జాతీయంగా రేటింగ్ సాధించిన విద్యార్థులను రాష్ట్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కవురు జగదీష్, అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్న నాయుడు అభినందించారు.

సముద్రంలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన అప్పారావు

కొత్తపల్లి: వేటకు వెళ్లిన ఒక మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ సముద్రంలో పడి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు సూరాడపేటకు చెందిన సూరాడ అప్పారావు (19) ఉప్పాడకు చెందిన సూరాడ యల్లాజీ బోటుపై శుక్రవారం తెల్లవారు జామున వేటకు వెళ్లాడు. సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయాడు. అతని కోసం తోటి మత్స్యకారులు గాలించగా తాతారావు బోటు వలకు చిక్కాడు. అప్పారావు మృతదేహాన్ని శనివారం తెల్లవారు జామున అమీనాబాద్ తీరానికి తీసుకువచ్చారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు లాంఛనాలతో మూర్తి అంత్యక్రియలు



పోలీసు లాంఛనాలతో మూర్తి అంత్యక్రియలు

కె.గంగవరం: తణుకులో తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి పార్థీవదేహాన్ని శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకువచ్చారు. శనివారం ఆ గ్రామానికి జిల్లా అదనపు ఎస్పీ ప్రసాద్ వచ్చి నివాళి అర్పించారు. గ్రామస్తులు, బంధువులు, సహచరులతో మాట్లాడారు. ఇదిలా ఉంటే కోటిపల్లి గ్రామ గోదావరి ఒడ్డున మూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్సై ఎస్‌కే జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలను పూర్తి చేశారు.

ఆలయంలో వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: మాధవపట్నంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడి బస్టాండ్ వద్ద ఉన్న ఆలయంలో రేకుల షెడ్ రాడ్‌కు పంచెతో ఉరి వేసుకున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉరి వేసుకున్న వ్యక్తి మోకాళ్లు నేలకు తాకి ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది. తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న తల్లి సంకర రత్నవతి సంఘటనా ప్రదేశానికి చేరుకుంది. తన కుమారుడు రాంబాబు (48) కొంత కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతుండడతో మాధవపట్నంలోని గ్లోబల్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నామని పోలీసులకు తెలిపింది. రోజూ కొమరిగిరి వెళ్లి రావడం ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామంలో ఉన్న బస్ షెల్టర్‌లో ఉంటూ రోజూ డాక్టర్‌తో ఇంజెక్షన్ చేయిస్తున్నట్లు చెప్పింది. శుక్రవారం సాయంత్రం తన కుమారుడిని అక్కడే ఉండమని చెప్పి కొమరిగిరిలో శనివారం పింఛను తీసుకోవడానికి వెళ్లినట్లు సత్యవతి చెప్పింది. ఇంతలో ఇలా జరిగినట్లు వివరించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సీఐ కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు కోరారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. అదే రోజు నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారని అన్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెంకటరావు వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి కాగా, ఏఆర్వోలుగా ఆయా జిల్లాల డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో 3,15,261 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు, కె.కృష్ణమోహన్, ఎస్.అప్పారావు, పి.వీరబాబు, బి.జయప్రకాష్, జి.సాయిబాబా, ఎ.వీరవెంకట సత్యనారాయణ, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కేసు నిర్వీర్యానికి కుట్ర

కరప: వాకాడ పాఠశాలలో కొందరి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు వీఎస్ రామారావు కేసును నిర్వీర్యం చేస్తున్నట్టు మానవ హక్కుల వేదిక శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. నిజ నిర్ధారణ కోసం వాకాడ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పోలీసులను కలసినట్టు ఆ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు కానీ ఏమీ చెప్పకపోవడం, కరప పోలీస్ స్టేషన్‌లో దీనికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు కాకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. బాధితులు, తల్లిదండ్రులు నోరు తెరిచి చెప్పుకోకుండా కట్టడి చేసినట్టు ఆరోపించారు. నిజ నిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉపాధ్యక్షుడు ఎ.రవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.